

కథా కౌముది

# కొండ లడ్డు నవ్వింది

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

ఇంటి ముందరి తులసికోట చుట్టూ తిరుగుతోంది అన్నపూర్ణక్క.

మూడు ప్రదక్షిణాలు అయ్యాక ఉత్తరం దిక్కుకు తిరిగింది. శేషాచలం కొండలు రాగి రంగులో మిలమిలా మెరుస్తూ కనిపించాయి.

చేతులు పైకెత్తి "ఏడు కొండలవాడా వెంకట రమణా... వస్తున్నా వస్తున్నా, పాత మొక్కుబడి తీర్చుకోవడానికి ఈరోజే వస్తున్నా!!" అని చెప్పి దండం పెట్టుకుంది.

ఏడవ తరగతి చదివే మనవడు కనకదాసును తోడు చేసుకుని తిరుపతి జీవకోన నుంచి తిరుమల కొండకి నడుచుకుంటూ బయలుదేరింది.

"నువ్వు కొండ ఎక్కలేవే అవ్వా!""అని కనకదాసు కవ్విస్తూ చెప్పినాడు.

"ఒరేయ్ కనకా... అరవైలో ఇరవై శరీరంరా ఇది. రాయిని పిండి చేసే 'కట్టె శరీరంరా' నా

ది. నువ్వే చూస్తావు కదా... జింకపిల్లలాగా చెంగుచెంగున నేను అలిపిరి మెట్ల మీద ఎగిరెగిరి నడిచేది. అయినా... రాతి కింది కప్పను కాపాడే దేవుడు నన్ను కాపాడలేడా?" అని గట్టిగట్టిగా చెప్పింది.

ముసిముసి నవ్వులు నవ్వినాడు కనకదాసు.

"మొత్తం ఖర్చు అంతా నీదే కదా!" అని అడిగినాడు.

"నీళ్ళకాడినుంచి నారాయుణిడి దర్శనం దాకా... అంతా నాదే... ఆనందం నీదే" అని నవ్వుతూ చెప్పింది.

కనకదాసు మనసు తియ్యటి కొండ జిలేబీ అయ్యింది. 'భలే భలే' అని చంకలు గుద్దుకున్నాడు.

చెప్పులు లేకుండా కపిల తీర్థం దారిలో నడుస్తున్నారు.

ఇంతలో ఓ ఆటోవాడు అన్నపూర్ణక్కను చూసి బండి ఆపి 'అలిపిరి, అలిపిరి' అని అరిచాడు.

“వీళ్ళకి కూడా లోకువ అయిపోయాను. నేను కొండకి నడవలేనని అనుకుంటున్నారా?' అని కర్తవ్యం సినిమాలో విజయశాంతిలా వాడి పైకి విరుచుకు పడబోయింది.

'ఎందుకొచ్చిన గొడవ' అనుకున్న ఆటో వాడు బండి వేగం పెంచి తుర్రుమన్నాడు.

మూడు మైళ్ళ దూరంలోని అలిపిరి చేరేసరికి కాళ్ళు లాగాయి.

చింత చెట్టు కింద కూర్చుని, సంచిలో పెట్టుకుని ఉన్న 'నీ క్యాప్' లు తీసి రెండు మోకాళ్ళకీ తగిలించుకుంది.

'నా ఈడు వాళ్ళకంతా ఈ మాయదారి మోకాళ్ళ నొప్పులు రాలేదు. నాకే వచ్చాయి, ఏమి చేసేదిరా భగవంతుడా...' అని బాధపడింది

'కొండపైకి వెళ్ళడానికి ఎన్ని మెట్లు ఉన్నాయో' కనుక్కుంది. 3500 మెట్లని తెలుసుకునేసరికి ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

ఒక్కసారిగా మోకాళ్ళ నొప్పులు గుర్తుకు వచ్చాయి.

అటూఇటూ చూసింది.

మెట్లదారిలోని మొదటి మెట్టుకు తల ఆనించి దండం పెట్టుకుంది..

' 'స్వామీ... ఒకే సారి రెండుమోకాలి చిప్పలూ మార్చుకుంటే డిస్కౌంట్ ఇస్తామని డాక్టర్ చెప్పినాడు. వచ్చే సంవత్సరం ఆపరేషన్ చేసుకోవాలనుకుంటున్నాను. ఇన్ని మెట్లూ ఎక్కలేను స్వామీ. క్షమించు. పడీలేచి నడిచినా గాలి గోపురం చేరేసరికి నాకోసం అంబులెన్సు కావాల్సి వస్తుంది. నడిచి రావాల్సిన మొక్కుబడి నాది. అందుకు క్షమాపణలు కోరుతూ రెండు వెండి మోకాలి రేకులు నీ హుండీలో వేస్తున్నాను” అని చెప్పి అలిపిరి స్వామికి మొక్కు చెల్లించింది.

అక్కడే పాదుకలను నెత్తిన పెట్టుకుని గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేసింది. మనవడు కనకదాసు నెత్తిన శఠ గోపం పెట్టించి బాగా ఆశీర్వదించమని పూజారిని అడిగింది. కనకదాసు పడీపడీ మొక్కినాడు.

పంచుతున్న పెరుగు అన్న ప్రసాదం తిని ఇద్దరూ ఎర్ర బస్సు ఎక్కినారు.

పాము తిరుగుళ్ళు తిరిగిన బస్సు కొండ బస్టాండు చేరింది.

బస్సు దిగుతూ అన్నపూర్ణక్క 'మొన్న పౌర్ణమి రోజున నేను వేసుకున్న షుగర్ మాత్ర వల్ల ఒంట్లో చక్కెర తగ్గి కళ్ళు తిరిగి కింద పడతా ఉంటే మొక్కుకున్నాను. బతికి బట్ట కడితే తల నీలాలు స్వామివారికి ఇద్దామని. పద... కళ్యాణ కట్టకు పోదాం' అని చెప్పి పైట కొంగు చీరలోకి దోపి నడవడం ప్రారంభించింది.

అన్నపూర్ణక్క వెనుకనే కుక్క పిల్ల లెక్కన కనకదాసు చేతులు ఊగిస్తూ నడిచినాడు.

దారిలో హుండాయ్ కంపెనీ వారి బూడిదరంగు శాంత్రో కారు ఆగి ఉంది.

'గోవిందా గోవిందా' అని పలుకుతూ అన్నపూర్ణక్క రోడ్డు మీదున్న కారు దాటేసింది.

'ఏమి అనుకుందో ఏమో...' అన్నపూర్ణక్క వెనక్కి వచ్చింది. జడని ముందరకి లాగి కారు అద్దంలో చూసుకుంది. నల్ల మేఘాలు పాయలుపాయలుగా వేలాడుతున్నట్లుగా అనిపించింది.

'పుట్టినప్పటినుంచి కుంకుడు కాయలే వాడుతున్నాను. ఒక్కటంటే ఒక్కటి తెల్ల వెంట్రుక లేదుకదా నా తలలో...' అని గర్వంగా చూసుకుంది. జడలోని మల్లెలను తీసి చెత్తబుట్టలో పడేసింది. 'గుండు కొట్టాక ఈమాదిరి పెరగాలంటే ఆరు నెలలు పడుతుందేమో...' అని కొంచెం బాధగా అనుకుంది.

మళ్ళీ 'స్వామి ఇచ్చింది స్వామికే కదా తిరిగి ఇచ్చేస్తున్నాం' అని వేదాంతం చెప్పుకుంది.

అన్నపూర్ణక్క చేస్తున్నదీ, చూస్తున్నదీ... అంతా 'ఆ...' అని నోరు తెరిచి చూస్తున్నాడు కనకదాసు.

'నోట్లోకి ఈగలు పోబోతాయిరా కనకా!' అని భుజం మీద తట్టి మళ్ళీ నడక మొదలుబెట్టింది.

టోపీల అంగడి వాడు 'టోపీ టోపీ' అని అరుస్తున్నాడు. అక్కడే గాజులు కొంటోంది దూరపు దాయాది సదాలక్ష్మి.

"ఏవమ్మీ బాగుండావా?" అని పలకరించింది అన్నపూర్ణక్క.

"అదే బాగు పూర్ణా... మా ఇంటాయనకు పిత్తాశయంలో రాళ్ళు తీసే ఆపరేషన్ జరిగింది. ఆయనకు ఒళ్ళు బాగయితే స్వామికి తలనీలాలు ఇస్తానని మొక్కుకున్నాను. అందుకని వచ్చాము" అని మొగుణ్ణి చూపిస్తూ చెప్పింది.

"మరి ఇంకా కళ్యాణ కట్టకు పోలేదా ?" అని అడిగింది.

"ఎందుకు పోలేదు. మొక్కుబడి చెల్లించి కోనేటిలో స్నానం చేసి దర్శనం చేసుకుని వచ్చాము"

నిండుగా ఉన్న సదాలక్ష్మి తల వెంట్రుకల్ని ఎగాదిగా చూసింది అన్నపూర్ణక్క.

సదాలక్ష్మి జడని ముందుకు లాగి "మా ఊర్లో ఆడోళ్ళు దేవుడికి తల వెంట్రుకలు ఇవ్వడమంటే, మూడు కత్తెరలు కత్తిరించడం" .

మెరుపు ముఖంతో అన్నపూర్ణక్క "దేవుడికి కోపం రాదా..." అని కొంచెం అనుమానం, కొంచెం భయంతో అడిగింది.

"అందుకే పరిహారంగా నూట పదహార్లు హుండీలో వేస్తాము" అని చెప్పి సదాలక్ష్మి అక్కడినుంచి కదిలింది.

ఆమె వెనుకే బక్కచిక్కిన మొగుడు పళ్ళు లేని నోరు చప్పరిస్తూ సదాలక్ష్మి కొంగు పట్టుకుని నడుస్తూ వెళ్ళాడు.

డాక్టరు 'చక్కెర వ్యాధి పూర్తిగా నయమయ్యింది. మీరు ఇకపై అన్నీ తినొచ్చు' అని చెప్పినంత సంబరపడింది అన్నపూర్ణక్క.

కళ్యాణ కట్ట రానే వచ్చింది. చీమల పుట్టలో నుంచి వచ్చే చీమల మాదిరి 'గిజగిజా' అని జనాలు ఉన్నారు.

"టికెట్ తీసుకుని వెళ్ళండి!" అని చెప్పింది ఓ ఆడ సిబ్బంది.

"గుండు కొట్టినా, మూడు కత్తెరలు ఇచ్చినా టికెట్ తీసుకోవాల్సిందేనా?" అని అడిగింది అన్నపూర్ణక్క.

"తప్పదు" అని గుడి గంట కొట్టినట్లు గట్టిగా చెప్పింది ఆడ సిబ్బంది.

టికెట్ తీసుకుని మూడు కత్తెరలు ఇచ్చేసి గోవిందలు నాలుగు పలికేసి కోనేరులో స్నానం చేద్దామని వెళ్ళారు.

కోనేటిలో కాలు పెట్టిన కనకదాసు "అవ్వా... చలే" అన్నాడు.

"నిండా మునిగితే చలి ఉండదురా మనవడా!" అంటూ తల పట్టుకుని నీళ్ళలో మూడు సార్లు ముంచింది.

"చలీ లేదు, పులీ లేదు... ముంచింది చాల్లే అవ్వా!!" అని అరవడంతో వదిలిపెట్టింది.

కోనేటి మెట్ల మీద నిలబడి తడి తుడుచుకుంటూ "వరాహస్వామి గుడికి పోదాంరా మనవడా!" అని చెప్పింది.

"మనం పోవాల్సింది వేంకటేశ్వర స్వామి గుడికి కదా!" అని అడిగినాడు.

మొదటిగా వరాహ స్వామి గుడికి వెళ్దాం అని చెప్పింది

ఎందుకు అక్కడికి మొదటిగా వెళ్ళాలి అని ఎదురు ప్రశ్న వేసినాడు.

"చేసిన మేలు మరువకూడదనడానికి నిదర్శనం ఇది. వేంకటేశ్వర స్వామికి ఆశ్రయం కల్పించిన స్థల దాత వరాహ స్వామి. అందుకని ఆయన దర్శనం చేసుకున్నాక, మరల వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్తాము" అని చెప్పింది.

'అలాగే' అని తల ఊపాడు.

xxxxxx

ఇద్దరూ వరాహ స్వామి దర్శనం చేసుకున్నాక వైకుంఠ ద్వారం గుండా ఆనంద నిలయం వెళ్ళడానికి లైన్లోకి వెళ్ళారు. అక్కడ మెట్లు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అన్నపూర్ణక్క భుజం మీది సంచి అడ్డం పడుతూ వచ్చింది.

"ఒరేయ్ కనకా... ఈ సంచి నీ భుజానికి తగిలించుకోరా!" అని చెప్పింది.

'నాకేమిటి లాభం?' అన్నట్లుగా చూసినాడు కనకదాసు.

దర్శనం అయ్యాక ప్రసాదంగా నాకో చిన్న లడ్డు, నీకో చిన్న లడ్డు ఇస్తారు. నా లడ్డు నీకే...' అని చెప్పేలోగానే సంచిని లాక్కొని భుజానికి తగిలించుకున్నాడు కనకదాసు.

అద్దం ముందర నిలబడుకుని పుల్లతో చందనాన్ని నామంగా పెట్టుకుని షెడ్ లో కూర్చున్నారు.

అప్పుడే దేవస్థానం వారు వేడివేడి ఉప్మా తెచ్చి పంచుతున్నారు.

వేడి ఉప్మా నుంచి వచ్చే పొగలనే చూస్తున్నాడు కనకదాసు.

'ఆకలే అవ్వా!' అన్నాడు కనకదాసు.

ఉరిమి చూస్తూ "కనకా... ఇంట్లో నువ్వు ఎట్లా పిలిచినా ఒప్పుకుంటాను. బయట వచ్చినప్పుడు నన్ను అవ్వా అని పిలవవద్దు, అమ్మమ్మా అని పిలువు" అంది.

"అట్లనే పిలుస్తాను అమ్మమ్మా!" అన్నాడు.

"నా బంగారు కొండ... అంతా మీతాత పోలిక !!" అని బుగ్గ గిల్లింది.

"అది సరే...మరి ఉప్మా విషయం..." తల గోకుతూ అడిగాడు.

"దేవుడి దర్శనం అయ్యేంతవరకు ఉపవాసం ఉండాలి" కంచు కంఠంతో చెప్పింది.

ఏమాత్రం మొహమాట పడకుండా "జీర్ణాశయంలో జెర్రులు ప్రాకినట్లు ఉండాది!" అన్నాడు

"సరే, స్వామికి క్షమాపణలు చెప్పి తెచ్చుకో!" అని చెప్పింది.

చకచకా వెళ్ళి కాగితంప్లేటులో సెగలుగక్కే ఉప్మా తెచ్చుకున్నాడు.

జనాలుండే లైన్ లోనే చక్కాముక్కలేసుకుని కూర్చున్నాడు.

తెరలు తెరలుగా వస్తున్న ఉప్మా వాసనకు అన్నపూర్ణక్క మనసు 'ఎక్కడికో...' వెళ్ళింది.

"పెద్దోళ్ళు తిన్నాక పిల్లోళ్ళు తినాలి!" అని గవర్నమెంట్ ఆర్డర్ ఉన్నంత గట్టిగా చెప్పి ప్లేటు లాక్కొని ఉప్మాని ఉండలుగా చేసుకుని నోట్లో వేసుకోసాగింది.

'మనకింకేమి మిగులుతుంది" అన్నట్లుగా కనకదాసు మరో ప్లేటు ఉప్మాకోసం పరిగెత్తినాడు.

'ఉప్మా తిని చేతులు కడుక్కుంటూ ఉంటె దేవస్థానం వారు వేడి వేడి పాలు అందించారు. 'షెడ్లలోని భక్తుల్ని కొండపైన, అల్లుళ్ళలాగా చూసుకుంటారు... అంటే ఇదేనేమో' అనుకుంది.

చీర కొంగుతో వేడి పాలను అందుకుని 'ఉఫ్ ఉఫ్' అని ఊదుకుంటూ చుక్క మిగలకుండా తాగేసింది.

xxxxxx

లైన్ చిన్నగా కదలసాగింది.

మహాద్వారం దాటి బంగారు వాకిలి గుండా గుడిలోకి వెళ్ళారు. స్వామివారిని దర్శనం చేసుకుని, చేసిన తప్పులకి క్షమాపణలు కోరి హుండీలో ముడుపులు చెల్లించారు.

ప్రసాదం క్యూలో వెళ్తే... వారు చిన్న లడ్డులు ఇవ్వలేదు. బెల్లం పొంగలి పెట్టారు. కనకదాసు ముఖం పొంగలిలోని ఎండు ద్రాక్ష మాదిరి నల్లబడింది.

"ఫర్లేదు. నా పొంగలి కూడా నీకే, నీకు పెద్ద లడ్డు తీసి ఇస్తాను" అని సర్ది చెప్పింది.

అప్పటిదాకా ఎండు ద్రాక్ష ముఖంలా ఉన్న కనకదాసు ముఖం తెల్లటి జీడి మామిడి లా అయ్యింది.

ఇద్దరూ లడ్డు కొనుక్కోవడానికి లడ్డూ కౌంటర్ క్యూలో నిలబడ్డారు.

చిన్నచిన్నగా కదులుతోంది క్యూ.

ఇంతలో నాలుగు మూరల పంచె కట్టిన కడప జిల్లా కుర్రోడు గబగబా వచ్చి ఏదో గట్టిగా అరిచి చెప్పాడు.

చలికి చెవిలో దూది పెట్టుకుని ఉన్న కనకదాసుకు అదేమీ సరిగా వినబడలేదు. 'ఏదో ఉంటుందిలే... మనకెందుకు?' అని అనుకున్నాడు.

చిన్నగా తన చేయి మీదుగా ఎవరో గోకినట్లు ఉంటే 'ఎవరా' అని చూశాడు.

గోకుతున్నది అన్నపూర్ణక్కే.

'ఏమిటి విషయం?' అన్నట్లుగా తల ఆడించాడు.

"నువ్వు క్యూలో ఉండు కనకా... అయిదు నిమిషాల్లో వస్తాను. ఒకటి కాకపోతే రెండు లడ్డులు కొనుక్కో" అని చెప్పి డబ్బులిచ్చింది. 'డబుల్ ధమాకా' అనుకున్నాడు కనకదాసు.

ఆ క్యూ నుంచి బయటపడటానికి కనకదాసుకు ఇరవై నిమిషాలు పట్టింది. ఎలాగైతేనేమి లడ్డూలు దొరికాయి. 'నన్ను తిను, నన్ను తిను...' అన్నట్లుగా లడ్డులు కనకదాసును కవ్వించాయి.

'అమ్మమ్మ రానీ... తిందాము' అని అక్కడే చేతులు పిసుక్కుంటూ నిలబడినాడు.

మరో పది నిమిషాలకు అలసిన ముఖంతో అన్నపూర్ణక్క అక్కడికి వచ్చింది.

చిన్నబిడ్డలా నవ్వుతూ "కనకా... మొగల్తూరు మొగలాయి, ఆరడుగుల అందగాడు కృష్ణంరాజును చూడలేకపోయాను. ఆయన అన్నగారి అబ్బాయి ప్రభాస్ ని అయినా ఈరోజు చూడగలిగినాను" అని చెప్పింది.

'హై వోల్టేజీ ప్లగ్ లో వేలు పెట్టినవాడిలాగా' గిలగిల్లాడినాడు కనకదాసు.

"వచ్చింది ప్రభాస్ సారా..." అంటూ గుడి ముందరికి పరుగులు తీయబోయాడు.

'ఎప్పుడో వెళ్ళినాడు బాహుబలి' అని జనం చెప్పుకోవడం వినిపించి గాలి తీసిన బెలూను అయినాడు.

చెప్పకుండా వెళ్ళినందుకు అన్నపూర్ణక్కను కోపంగా చూసినాడు కనకదాసు. మరింత కోప్పడితే 'తీసిచ్చిన లడ్డూలు లాక్కునేస్తుందేమో' నని గమ్మున ఉండిపోయినాడు.

వరాహ స్వామి గెస్ట్ హౌస్ దగ్గరికి నడుచుకుంటూ వెళ్ళారు.

ప్రైవేటు జీపు డ్రైవర్ బండిని స్టార్టింగ్ లో పెట్టి 'దిగవ తిరుపతి, దిగవ తిరుపతి అని అరుస్తున్నాడు.

ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు.

క్షణాల్లో జీపు నిండింది.

సర్రున స్టార్ట్ చేసి దుర్రుదుర్రున మిట్టపల్లాలు డ్రైవ్ చేసుకుంటూ వి.ఐ.పి.లు దిగే పద్మావతి గెస్ట్ హౌస్ దగ్గర బండి ఆపాడు.

'అయిదు నిమిషాల్లో వస్తాను' అని చెప్పి గబగబా వెళ్ళాడు.

అయిదు... పది...ఇరవై నిమిషాలయ్యింది.

జీపులోని ప్యాసింజర్లు 'డ్రైవర్ ఎక్కడికి పోయినాడా...' అని తిట్టుకుంటూ ఉన్నారు.

అర్థ గంట తర్వాత... రాగి చెంబుతలని ఆడిస్తూ, ముసిముసినవ్వులు నవ్వుతూ వచ్చాడు.

సర్రున సీటులో కూర్చుని జీప్ ను స్టార్ట్ చేసి స్టీరింగ్ సర్రుసర్రున తిప్పుతూ బయలుదేరాడు.

"ఎక్కడికి పోతివి నాయనా ఇంతసేపు..." అని కొంచెం కోపం, కొంచమే శాంతం కలిపి అడిగింది అన్నపూర్ణక్క.

"ప్రభాస్ దిగిన రూమ్ కాడికి పోయినాను" అని చెప్పినాడు.

అందరూ తలలు తిప్పినారు.

“ఉన్నాడా ఉన్నాడా... ఉంటే... మా కనకదాసుకు చూపిస్తాను” అని పెద్ద గొంతుతో అరిచింది అన్నపూర్ణక్క.

“ఎప్పుడో వెళ్ళి పోయినాడు. తెలిసే వెళ్ళినాను” అన్నాడు.

అందరూ ఆశ్చర్యంగా అతడివైపు చూసినారు

“తెలిసే ఎందుకు వెళ్ళినావు?” అని అడిగినారు.

“ఆయన ఏ రూమ్ లో దిగినాడు? ఆ దిగిన రూమ్ ఎట్లా ఉంటుందో చూద్దామని!” అని బదులిచ్చాడు.

‘మీ సినిమా యాక్టర్ల పిచ్చి పాడుగాను... గుడులకాడికి వచ్చినా వాళ్ళని వదిలి పెట్టరా...’ అని జీపులోని ఓ పెద్దాయన చిన్నగా గొణగడం వినిపించింది.

అప్పుడే లడ్డు తిందామని సంచి తెరిచిన కనకదాసుకు కొండ లడ్డు నవ్వినట్లుగా కనిపించింది.

★★★★★★

COMMENTS